సాక్షి వికారాబాద్

గురువారం । 3 । ఆగస్టు । 2023



యూరియా.. మాయ!

రైతుల అవసరాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. యూరియా ధరలు పెంచి విక్రయిస్తున్నారు. 8లో▸



అతివేగంతోనే ప్రమాదాలు

అతివేగం కారణంగానే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. 8లో▸



బడుల్లో సమస్యల తిష్ట

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తిష్టవేశాయి. ఉపాధ్యాయులు, తరగతి గదుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

గిరిజన సమస్యలు పరిష్కరించండి

ఏఐటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌నాయక్



అడిషనల్ కలెక్టర్‌కు సేవాలాల్ చిత్రపటం అందజేస్తున్న ఏఐటీఎఫ్ నాయకులు

యాలాల: జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్‌ను బుధవారం ఏఐటీఎఫ్(ఆల్ ఇండియా ట్రైబల్ వెల్ఫేర్) నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా వ్యాప్తంగా తండాల్లో నెలకొన్న సమస్యలతో పాటు రెవెన్యూ సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం అడిషనల్ కలెక్టర్‌కు సంత్ సేవాలాల్ చిత్రపటాన్ని బహూకరించారు. లింగ్యా నాయక్‌ను కలిసిన వారిలో ఏఐటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాథోడ్ ఆనంద్ నాయక్, నాయకులు రాథోడ్ కిషన్, వెంకటేశ్, దేవ్‌జీ తదితరులు ఉన్నారు.

బాలకార్మిక రహిత జిల్లాగా మారుస్తాం

ఎస్పీ కోటిరెడ్డి



అనంతగిరి: వికారాబాద్‌ను బాల కార్మిక రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. జులై 1నుంచి 31 వరకు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-9లో భాగంగా జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 104 మంది బాలకార్మికుల్లో 97 మంది బాలురు, ఏడుగురు బాలికలను గుర్తించగా ఇద్దరు బాలురు వేరే రాష్ట్రానికి చెందిన వారున్నారని చెప్పారు. వ్యాపార సముదాయాలు, పరిశ్రమలు, ఇతర పనులు చేయిస్తున్న ఆరుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ ఆపరేషన్లో పోలీసు, రెవెన్యూ, కార్మిక, విద్యాశాఖలు, బాలల రక్షణ విభాగం అధికారులు ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ బాల కార్మికులను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించారని వివరించారు. బాల కార్మికుల తల్లిదండ్రులకు పోలీసుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. బాల కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. డయల్ 100 లేదా 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

మైనార్టీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ కోచింగ్

వికారాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్ సర్వీస్ 2024 పరీక్షకు వంద మంది మైనార్టీ అభ్యర్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిని సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ శిక్షణకు రిజర్వేషన్ ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33% సీట్లు, దివ్యాంగులకు ఐదు శాతం సీట్లు కేటయించినట్లు చెప్పారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2లక్షలకు మించరాదన్నారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులందరూ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని,ప్రవేశాలుపూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందన్నారు. వివరాలకు 040-23236112ను సంప్రదించాలన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: ఓపెన్ స్కూల్‌లో 2023-24 సంవత్సరానికి గాను ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు ఆసక్తికలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రేణుకాదేవి తెలిపారు. బుధవారం డీఈఓ కార్యాయంలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు సంబంధించి వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 31వరకు గడువు ఉందని చెప్పారు. మరిన్ని వివరాలకు జిల్లా కోఆర్డినేటర్ సత్యానారయణను 8008773523లో సంప్రదించాలన్నారు. ఈ వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో నవాబుపేట ఎంఈఓ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

5న రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం

వికారాబాద్ అర్బన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, ఆఫీస్ బేరర్స్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈ నెల 5న సర్వసభ్య సమావేశం నిర్వహించినున్నట్లు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో శనివారం ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి సొసైటీలో నమోదైన 574మంది సభ్యులు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

కదలని హై‘వే’!



విస్తరణ పనులకు నోచుకోని మన్నెగూడ- అప్పా జంక్షన్ రహదారి

నత్తనడకన సాగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు.. ప్రజలకు నరకం చూపుతున్నాయి. నేటికీ ఒక కొలిక్కిరాక.. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏటా 200మంది వరకు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. రహదారి పనుల జాప్యం.. ప్రజలకు శాపంగా మారింది.

46 కిలోమీటర్ల మేర నిలిచిపోయిన రోడ్డు విస్తరణ

- టెండర్ దక్కించుకున్న మెగా సంస్థ
- ఆరు నెలలకు ఒకసారి హడావుడి
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

వికారాబాద్: మన్నెగూడ నుంచి హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీ వరకు చేపట్టనున్న నాలుగులేన్ల రహదారి నిర్మాణంలో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. ఈ రహదారిలో ప్రమాదాలు నిత్యకృత్యమై వాహనదారుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఈ రహదారి నిర్మాణానికి స్థానిక నేతలు దశాబ్దకాలంగా ప్రతిపాదనలు పంపిస్తుండగా 2017లో హైదరాబాద్-బీజాపూర్ అంతర్రాష్ట్ర రహదారి 163వ జాతీయ రహదారిగా రూపాంతరం చెందింది. రద్దీ కాస్త తక్కువగా ఉండే 72 కిలోమీటర్ల మేర రూ.250 కోట్ల వ్యయంతో మూడు లేన్ల రహదారిని మన్నెగూడ నుంచి కర్ణాటక సరిహద్దులోని రావులపల్లి వరకు పూర్తి చేశారు. రద్దీగా ఉండే మన్నెగూడ-పోలీస్ అకాడమీ వరకు మరో 46 కిలోమీటర్ల పనుల్లో మాత్రం జాప్యం చేస్తున్నారు. 2022 మార్చిలో టెండర్ ప్రక్రియ పూర్తి చేయగా మెగా సంస్థ ఈ కాంట్రాక్టు దక్కించుకుంది. టెండర్ పూర్తయి ఏడాదిన్నర గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభించడం లేదు. ఈ హైవేతో పాటుగా రాష్ట్రంలో మంజూరైన హైవేలు పూర్తవ్వగా ఈ హైవే పనుల ప్రారంభానికి నోచుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మిషన్లు తీసుకువచ్చి రోడ్డు పక్కన పెట్టి రోడ్డుకు ఇరువైపులా ఉన్న హోటల్స్, షాపులు తొలగించాలని ఆరు నెలలకు ఒకసారి నోటీసులు ఇవ్వడం తప్పా.. పనులు ప్రారంభించడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రహదారి రక్తసిక్తం

కర్ణాటక, పరిగి, కొడంగల్ వైపు నుంచి ప్రయాణించే వాహణాలు, వికారాబాద్, తాండూరు వైపు నుంచి ప్రయాణించే వాహనాలు మన్నెగూడ వద్ద కలుస్తాయి. దీంతో మన్నెగూడ నుంచి హైదరాబాద్ వరకు వాహణాల రద్దీ తీవ్రంగా పెరుగుతోంది. దీనికి తోడు ఇటీవల హైదరాబాద్ నుంచి అనంతగిరికి పర్యాటకుల తాకిడి పెరగడంతో కిలోమీటర్ల మేర వాహణాలు నిలిచిపోయి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు మలుపులు ఎక్కువగా ఉండడంతో తరచూ ప్రమాదాల బారిన పడుతూ.. రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. ఈ మార్గంలో పోలీసుల లెక్కల ప్రకారం ఏడాదికి 200మంది వరకు మృత్యువాతపడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కర్ణాటక, తాండూరు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వస్తున్న సిమెంటు ట్యాంకర్లు, ఎర్రమట్టి లారీలు సైతం అధిక వేగంతో దూసుకువెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

మలుపులు తగ్గేనా..?

వికారాబాద్ నుంచి హైదరాబాద్ వరకు రోడ్డు మార్గంలో మలుపులు ఎక్కువగా ఉన్నాయి. రహదారి నిర్మాణానికి టెండర్లు పూర్తయినందున కొత్తగా విస్తరించే మార్గంలో మలుపులు తగ్గిస్తారా..? లేక ఉన్న దారిలోనే వేస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో ఈ రోడ్డు రిచ్‌లైన్ (బ్రిడ్జిలు, కల్వర్టులు అవసరం లేకుండా ఎత్తయినా ప్రదేశం మీదుగా నిర్మించేది) రోడ్డు కావటంతో ఎక్కువ మలుపులు వచ్చాయి. అయితే దీన్ని జాతీయ రహదారి నామ్స్ ప్రకారం నిర్మిస్తే రోడ్డు దూరం తగ్గే అవకాశం ఉంది. కాగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ విధానానికి అంగీకరించటంలేదనే ఆరోపనలు వినిపిస్తున్నాయి. కొందరు పెద్దలు హైవే పనులు పూర్తికాకముందే ఆ ప్రాంతంలో భూములు కొనుగోలు చేసేందుకే రోడ్డు పనులు జాప్యం చేస్తున్నారని పలువరు చర్చించుకుంటున్నారు. రోడ్డు నిర్మాణ విషయం తెరపైకి వచ్చిన ప్రతీ సారి తామంటే తామే మంజూరు చేయించామని గొప్పలు చెప్పుకొనే టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలు పనులు ప్రారంభానికి కృషి చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ఎంపీ రంజిత్‌రెడ్డిపై జిల్లా వాసులు బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి రుణ మాఫీ

- 45 రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన ప్రభుత్వం
- చెక్కుల రూపంలో రైతులకు అందజేయాలని నిర్ణయం

విడతల వారీగా వివరాలు

విడత	రైతులు	రుణమాఫీ
మొదటి విడత	10,807	రూ.16.24 కోట్లు
రెండవ విడత	21,193	రూ.78.41 కోట్లు
మూడో విడత	38,000	రూ.312 కోట్లు (నేటి నుంచి)

వికారాబాద్: గతంలో రుణమాఫీ ప్రక్రియ మధ్యలో నిలిచిపోయింది. మిగిలిన రైతుల రుణాలు సైతం మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం సీఎం కేసీఆర్ ఇందుకు సంబంధించిన ప్రకటన విడుదల చేశారు. 2018 ఎన్నికల ముందు రూ.లక్షలోపు పంట రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన సర్కారు అధికారంలో వచ్చాక నామమాత్రంగా రెండు విడతలుగా రూ.39 వేల వరకు ఉన్న రుణాలు మాత్రమే మాఫీ చేసింది. దీంతో రైతులతో పాటు ప్రతిపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సర్కారు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గతంలో మాఫీ చేయగా మిగిలిన రైతుల రుణాలను సైతం మాఫీ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. గురువారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించి సెప్టెంబర్ రెండో వారం లోగా విడతల వారీగా పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో జిల్లా పరిధిలోని 38వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ఈ రుణమాఫీ డబ్బులు రైతులకు చెక్కుల రూపంలో ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో మొత్తం 6లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా 2.9లక్షల మంది రైతులు ఉన్నారు.ఇందులో 2.1లక్షల మంది రైతులు వ్యవసాయ రుణాలు పొందగా 1.46లక్షల మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. లక్షలోపు రుణాలు పొందిన రైతులు జిల్లాలో 70 వేల మంది ఉండగా వీరికి రూ.406 కోట్ల రుణాలు మాఫీ కావాలి. ఇప్పటి వరకు రెండు విడతల్లో 32 వేల మంది రైతులకు రూ. 94.65 కోట్లు మాఫీ అయ్యాయి.

38 వేల మంది రైతులకు లబ్ధి

ప్రభుత్వం బుధవారం తీసుకున్న రుణమాఫీ నిర్ణయంతో జిల్లాకు చెందిన 38 వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుందని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. రూ.లక్ష లోపు రుణాలకు సంబంధించి జిల్లాలో 70వేల మంది రైతులకు రూ.406.65కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉంది. మొదటి, రెండు విడతల్లో రూ.94.65కోట్లు మాఫీ అయ్యాయి. మిగిలిన 38 వేల మంది రైతులకు సంబంధించి రూ.312 కోట్ల రుణాలు మాఫీ చేయాల్సి ఉంది. కాగా ఈ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. లక్షలోపు రుణాలు పొందిన రైతులందిరికీ లబ్ధి చేకూరనుంది.





వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

కి‘లేడీ’ అరెస్ట్

ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగం ఉందని అబద్ధమాడింది.. ఉద్యోగం లేదనే విషయం తెలిస్తే ఎక్కడ వదిలేస్తారోనని.. ఆఫీసు పేరుతో నిత్యం బయటకు వచ్చింది. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో ఉద్యోగాల పేరిట రూ.2.50 లక్షలు వసూలు చేసింది. అంతటితో ఆగక నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందజేసి పోలీసులకు చిక్కింది. సదరు కి‘లేడీ’ని అరెస్టు చేసిన పోలీసులు కేసు వివరాలను వెల్లడించారు.

- అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట బురిడీ
- నకిలీ ఆర్డర్ కాపీలు ఇచ్చిన మహిళ
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- నగదు రికవరీ

అనంతగిరి: ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని, డబ్బులు వసూలు చేసిన ఓ మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ నర్సింలు బుధవారం వికారాబాద్ పీఎస్‌లో వెల్లడించారు. అదిలాబాద్ జిల్లాకు చెందిన గోమాస శిరీష అలియాస్ అనూష రెండేళ్ల క్రితం చదువు నిమిత్తం హైదరాబాద్ వచ్చింది. ఈ సమయంలో సిద్ధార్థ అనే అబ్బాయితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని సిద్ధార్థను కోరింది. దీనికి అతడు నిరాకరించడంతో.. తనకు ప్రభుత్వ ఉద్యోగం ఉందని (జూనియర్ అసిస్టెంట్) నమ్మించింది. దీంతో సిద్ధార్థ పెళ్లి ఆమెను వివాహం చేసుకున్నాడు. ఇదిలా ఉండగా తనకు జాబ్ లేదనే విషయం అత్తమామలకు తెలిస్తే.. ఎక్కడ వదిలేస్తారోనని భయపడసాగింది. ఉద్యోగం చేస్తున్నట్లు నిత్యం బయటకు వచ్చి డబ్బులు ఎలా సంపాదించాలనే విషయాలను ఆలోచించసాగింది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం మల్కాజిగిరి కలెక్టర్ ఆఫీస్‌లో మౌలాలికి చెందిన ఎం.వాణిరెడ్డితో శిరీషకు పరిచయమైంది. తాను వికారాబాద్‌లో తహసీల్దార్‌గా పనిచేస్తున్నానని శిరీష.. వాణిరెడ్డికి చెప్పింది. తమ ఆఫీసులో ఓ కాంట్రాక్ట్ పోస్టు ఖాళీగా ఉందని, ఇందుకోసం డబ్బు ఖర్చువుతుందని నమ్మించింది. రెండు విడతల్లో వాణిరెడ్డి నుంచి ఫోన్ పే ద్వారా రూ.90 వేలు వసూలు చేసింది. అంతటితో ఆగకుండా మరో పోస్టుకు కూడా అవకాశం ఉందని, ఈ ఉద్యోగాన్ని మీ భర్తకు ఇప్పిస్తానని మరో రూ.1.60 లక్షలు వసూలు చేసింది. మొత్తం రూ.2.50 లక్షలు తీసుకుని నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందజేసింది. వీటిని తీసుకున్న భార్యాభర్తలు ఉద్యోగంలో చేరేందుకు గత నెల 10న సదరు కార్యాలయానికి వెళ్లగా నకిలీవని తేలింది. తాము మోసపోయామని గుర్తించిన వాణిరెడ్డి అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితురాలిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించింది. శిరీష నుంచి రూ.2.50 లక్షలు రికవరీ చేశామని డీఎస్పీ తెలిపారు. ఉద్యోగాల పేరిట మోసాలుకు పాల్పడుతున్న వారి విషయంలో నిరుద్యోగులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో వికారాబాద్ సీఐ శీను తదితరులు పాల్గొన్నారు.

‘నులి’పేద్దాం

అపరిశుభ్రతే అన్నింటికీ కారణం. వ్యక్తిగత పరిశుభ్రత కొరవడిన కారణంగా పిల్లల కడుపులో నులిపురుగులు పెరుగుతాయి. పరిశుభ్రత, అవగాహనతోనే వీటిని నివారించవచ్చు. ఇందుకు నేడు జిల్లా వ్యాప్తంగా నులిపురుగు నివారణ మాత్రలు వేసేందుకు వైద్యారోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది. మాత్రల పంపిణీలో ఏఎన్ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ టీచర్లతోపాటు జిల్లా అధికారులను భాగస్వాములను చేశారు.

- నేడు జిల్లా వ్యాప్తంగా నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ
- ఏడాది నుంచి 19 ఏళ్ల బాలబాలికలకు..
- ఏర్పాట్లు పూర్తిచేసిన వైద్యారోగ్య శాఖ



విద్యా సంస్థలు	సంఖ్య	చిన్నారుల సంఖ్య
అంగన్వాడీలు	1,089	44,241
ప్రాథమిక పాఠశాలలు	714	40,159
యూపీఎస్ పాఠశాలలు	118	11,535
ఉన్నత పాఠశాలలు	195	38,306
కళాశాలలు	49	13,485
రెసిడెన్షియల్ స్కూల్స్	40	14,127
మదర్సాలు	13	1,678
ప్రైవేటు పాఠశాలలు	182	48,204
బడికి వెళ్లని వారు	-	7,594

వికారాబాద్ అర్బన్: 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు నులి పురుగుల మాత్రలు వేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిద్ధమయింది. ఇందుకు అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. పల్స్ పోలియో తరహాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు మందులు వేయడంపై శిక్షణ పూర్తిచేశారు. నులిపురుగు మాత్రలను గ్రామాల్లోని ఏఎన్ఎంలకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందించారు.

ప్రతి చిన్నారికి వేయాలి

నులిపురుగుల మాత్రలతో పిల్లలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. 1 నుండి 2 ఏళ్ల పిల్లలకు సగం మాత్ర(200 మిల్లీ గ్రాములు), 2 నుంచి 19 ఏళ్ల పిల్లలకు ఒక మాత్ర వేయాలి. పిల్లలు తిన్న తరువాతే మాత్రలు వేయాలి. మాత్రలు వేయడంపై ఇప్పటికే ఆరోగ్యసిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లకు శిక్షణ ఇచ్చాం. మాత్రల పంపిణీకి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తిచేశాం. వాతావరణంలో మార్పుల వల్ల పిల్లలకు కండ్ల కలక వచ్చే అవకాశం ఉంది. పిల్లలు ఎప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కునేలా పెద్దలు జాగ్రతలు తీసుకోవాలి. కండ్ల కలక వస్తే వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి.

– డాక్టర్ పాల్వాన్ కుమార్, జిల్లా వైద్యాధికారి

దివ్యాంగులకు సహాయ పరికరాలు

- అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్ అర్బన్: దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసే పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. బుధవారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సెలక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్‌శర్మ మాట్లాడుతూ.. 2022-23 ఏప్రిల్‌లో సహాయ పరికరాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో దివ్యాంగుల విద్య, దివ్యాంగ లోపం శాతాన్ని బట్టి జిల్లా స్థాయి ఎంపిక కమిటీ అభ్యర్థులను ఎంపిక చేశారన్నారు. 10 రెట్రో ఫిట్టెడ్ మోటార్ వాహనాలు, ఎనిమిది బ్యాటరీ వీల్ చైర్స్, ఐదు ల్యాప్‌టాప్‌లు, 13 4జీ స్మార్ట్ ఫోన్స్, ఒక డైజీ ప్లేయర్, 19 ట్రైసైకిళ్లు, మూడు వీల్‌చైర్స్, 37 ఊతకర్రలు, 13 వినికిడి పరికరాలు, 15 వాకింగ్ స్టిక్స్, మూడు స్మార్ట్ కేన్స్, ఎనిమిది టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ మంజూరయ్యాయని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి కె.లలిత కుమారి, డీఆర్డీఓ అడిషనల్ పీడీ నర్సింలు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మేఘనా గాంధీ తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారులతో సమావేశమైన కలెక్టర్ హరీష్

వైన్స్ 674

గ్రేటర్ జిల్లాల్లో వైన్‌షాపులు ఇలా..

ఎక్సైజ్ జిల్లా	2019-21	2023-25
హైదరాబాద్	79	80
సికింద్రాబాద్	94	99
మల్కాజ్‌గిరి	82	88
మేడ్చల్	99	114
సరూర్‌నగర్	114	134
శంషాబాద్	81	100
వికారాబాద్	46	59
మొత్తం	595	674

- గడువుకు ముందే మద్యం షాపులకు నోటిఫికేషన్
- డిసెంబర్ ఒకటి నుంచి అమల్లోకి రానున్న కొత్త లైసెన్సులు

సాక్షి, రంగారెడ్డి: ప్రభుత్వ నిర్ణయంతో గడువుకు ముందే కొత్త మద్యం షాపులకు లైసెన్స్‌ల జారీ ప్రక్రియ మొదలైంది. ప్రస్తుతం కొనసాగుతున్న వైన్స్ గడువు నవంబర్ 30తో ముగియనుంది. డిసెంబర్ నుంచి కొత్త లైసెన్సుల విధానం అమల్లోకి రావాలి. కానీ తాజాగా మద్యం షాపుల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. గతంలో మాదిరిగానే ఈసారి కూడా గౌడ, ఎస్సీ, ఎస్టీ కులాలకు రిజర్వేషన్లు వర్తింపజేయనున్నారు. ఈ మేరకు బుధవారమే లాటరీ ద్వారా ఆయా కులాలకు కేటాయించే షాపుల సంఖ్యను అధికారులు నిర్ధారించారు. వీటికి ప్రభుత్వం ఈ నెల 25న(నాలుగో శుక్రవారం) నోటిఫికేషన్ జారీ చేయనుంది. అదే రోజు నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు చేస్తోంది. ఒక్కో దరఖాస్తు ఫీజును రూ.2 లక్షలుగా నిర్ణయించింది. తుది గడువు ఆగస్టు 18గా పేర్కొంది. ఈ నెల 21న డ్రా ద్వారా దరఖాస్తు దారులకు షాపులను కేటాయించి, 30న ఆయా దుకాణాలకు కొత్త సరుకు అందజేయనుంది. ఇందులో భాగంగా కలెక్టర్ హరీష్ బుధవారం తన కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రక్రియకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

రిజర్వేషన్లు ఇలా..

సామాజికవర్గం	షాపులు
గౌడ	74
ఎస్సీ	49
ఎస్టీ	8
ఓపెన్	543

రూ.130 కోట్లకుపైగా..

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మొత్తం ఏడు(హైదరాబాద్, సికింద్రాబాద్, సరూర్‌నగర్, శంషాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్) ఎక్సైజ్ జిల్లాలు ఉన్నాయి. ఇందులో 674 షాపులు ఉండగా, రిజర్వేషన్ ప్రకారం గౌడ కులస్తులకు 15 శాతం చొప్పున మొత్తం 74 షాపులు, ఎస్సీలకు 10 శాతం చొప్పున మొత్తం 49 షాపులు, ఎస్టీలకు ఐదు శాతం చొప్పున 8 షాపులు కేటాయించింది. మిగిలిన 543 షాపులను ఓపెన్ కేటగిరి కింద నమోదు చేసింది. 2019-21లో దరఖాస్తుల ద్వారానే రూ.130 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. ప్రస్తుతం కూడా అదే స్థాయిలో దరఖాస్తులు అందే అవకాశం లేకపోలేదు. అంతేకాదు లైసెన్సులు పొందిన వారు ఒక్కో షాపునకు అడ్వాన్స్‌గా ప్రభుత్వానికి రూ. 20 లక్షల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

సర్వత్రా అభ్యంతరాలు

ప్రభుత్వ నిర్ణయంపై మద్యం వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. లైసెన్స్ గడువు ముగియక ముందే మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా లైసెన్స్ తుది గడువుకు వారం పది రోజుల ముందు నోటిఫికేషన్ జారీ చేస్తుంటారు. ఈసారి అలా చేయకపోవడంతో లైసెన్సు కోసం వ్యాపారులు మూడు నెలల ముందే ప్రభుత్వానికి ఫీజుల రూపంలో రూ.లక్షలు చెల్లించాల్సి వస్తుంది. 2023 డిసెంబర్ తర్వాత కొత్తగా ఏర్పాటు కాబోయే ప్రభుత్వానికి దక్కాల్సిన ఆదాయాన్ని ముందుగానే రాబట్టుకోవడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నారు.

క్లుప్తంగా

తహసీల్దార్లకు పోస్టింగ్

ముగ్గురు ఆర్ఐలకు స్థాన చలనం

వికారాబాద్: జిల్లా పరిధిలో వివిధ మండలాలతో పాటుగా కలెక్టరేట్, రెవెన్యూ, డివిజన్ కార్యాలయా ల్లో తహసీల్దార్లకు పోస్టింగులు ఇచ్చారు. సాధారణ బదిలీల్లో భాగంగా మంగళవారం వివిధ జిల్లాల నుంచి 17 మంది తహసీల్దార్లను జిల్లాకు కేటాయించిన విషయం విదితమే. వీరికి కలెక్టర్ నారాయణరెడ్డి మండలాలను కేటాయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిగి తహసీల్దార్‌గా వై.దానయ్య, తాండూరు ఆర్డీఓ కార్యాలయం డీఏఓగా డి.గణేశ్‌కు పోస్టింగ్ ఇస్తూ దుద్యాల తహసీల్దార్‌గా డిప్యూటేషన్ ఇచ్చారు. మోమిన్‌పేట తహసీల్దార్‌గా మనోహర్ చక్రవర్తి, పూడూరు తహసీల్దార్‌గా ఉమాదేవి, బంట్వారం తహసీల్దార్‌గా ప్రవీణ్‌కుమార్, కుల్కచర్ల తహసీల్దార్‌గా మురళీధర్, పెద్దేముల్ తహసీల్దార్‌గా కిషన్, వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం డీఏఓగా ప్రభును నియమిస్తూ చౌడాపూర్ తహసీల్దార్‌గా డిప్యూటేషన్ ఇచ్చారు. నవాబుపేట తహసీల్దార్‌గా జయరామ్, తాండూరు తహసీల్దార్‌గా తారాసింగ్, యాలాల తహసీల్దార్‌గా పద్మావతి, కొడంగల్ తహసీల్దార్‌గా బి.విజయ్‌కుమార్, దౌల్తాబాద్ తహసీల్దార్‌గా సి.విజయ్‌కుమార్, వికారాబాద్ తహసీల్దార్‌గా లక్ష్మీనారాయణ, కోట్‌పల్లి తహసీల్దార్‌గా ఆశాజ్యోతి, మర్పల్లి తహసీల్దార్‌గా రాములు, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా గంగాభవాని, పరిగి తహసీల్దార్‌గా పనిచేసిన రాంబాబును దోమ మండల తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. వీరితో పాటు దోమ ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న లింగంను కోట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి, పెద్దేముల్ ఆర్ఐను దోమకు, మరో ఆర్ఐ సతీష్‌ను వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ చేశారు.

బోధనకు నూతనత్వాన్ని జోడించాలి

డీఈఓ రేణుకాదేవి



ఉపాధ్యాయులకు బోధిస్తున్న తీరును పరిశీలిస్తున్న డీఈఓ

ధారూరు: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనకు నూతనత్వాన్ని జోడించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సూచించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో బుధవారం ఇంగ్లిష్, తెలుగు, గణితం బోధించే టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఈఓ మాట్లాడుతూ.. ఎఫ్ఎల్ఎన్ ప్రాథమికస్థాయి పాఠ్యపుస్తకాలకు అనుబంధంగా రూపొందించిన బోధనాభ్యాసన, హ్యాండ్ బుక్స్, వర్క్ బుక్స్‌పై ఉపాధ్యాయులకు అందిస్తున్న ఈ శిక్షణను అందరూ అవగాహన చేసుకోవాలని సూచించారు. అన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు సాధించే దిశగా నిర్దేశించిన సోపానాలను అవలంబిస్తూ వ్యక్తిత్వ నిర్మాణానికి, అభివృద్ధికి తోడ్పాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ నిర్వహణకు హ్యాండ్‌బుక్, వర్క్ బుక్‌లు సులభతరం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ధారూరు ఎంఈఓ బాబుసింగ్, ధారూరు కాంప్లెక్స్ హెచ్ఎం దేవియా, కాంప్లెక్స్ సెక్రటరీ జి.అంజిలయ్య, డీఆర్‌పీ నర్సింహరాజ్, రిసోర్స్ పర్సన్లు నర్సింహులు, శ్రీనివాసులు, సీఆర్‌పీలు సత్యనారాయణ, అంజయ్య, రాజశేఖర్, రవికుమార్, మీనాక్షి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మందిపై రౌడీషీట్

మోమిన్‌పేట: నేర ప్రవృత్తికి పాల్పడినవారిని వదిలిపెట్టమని మోమిన్‌పేట ఎస్ఐ విఠల్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన పీఎస్‌లో మాట్లాడుతూ.. హత్య చేసేందుకు సహకరించిన, అందుకు బాధ్యులైన వారిపై రౌడీషీట్ నమోదు చేస్తామన్నారు. గత నెల 2న లచ్చానాయక్ తండాకు చెందిన విఠల్‌నాయక్‌ను తుఫాన్ వాహనంతో ఢీకొట్టి హత్యకు పాల్పడిన వారందరిపై రౌడీ షీట్ నమోదు చేశామన్నారు. మోతీలాల్, పవన్‌కుమార్, నరేందర్, వారికి సహకరించిన సంగారెడ్డి జిల్లాకు చెందిన సల్మాన్‌ఖాన్, నరేష్, జైపాల్, రమేష్, రాజుపై రౌడీషీట్ నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

యూరియా.. మాయ!



పక్క ఫొటోలో కనిపిస్తున్న రైతు దోమ మండలం పాలేపల్లికి చెందిన శ్రీశైలం. ఇతను ఐదెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాడు. పంటకు యూరియా వేసేందుకు కుల్కచర్లలోని ఓ ఫెర్టిలైజర్ దుకాణానికి వెళ్లి 18 బస్తాలు కొనుగోలు చేశాడు. ఒక్కో బస్తా అసలు ధర రూ.266 ఉండగా.. రూ.300 చొప్పున వ్యాపారి బిల్లు చేశాడు. ఇదేమని అడిగితే.. ఇష్టం ఉంటే కొను.. లేదంటే వదిలేయ్ అని సమాధానం చెప్పాడు. అడిగినంత చెల్లించక తప్పలేదని వాపోయాడు.

- అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులు
- కృత్రిమ కొరత సృష్టిస్తూ ఇబ్బందులు
- ఆందోళనలో కర్షకులు



దుకాణంలో నిల్వ ఉన్న యూరియ బస్తాలు

పరిగి: రైతుల అవసరాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. యూరియా ధరలు పెంచి విక్రయిస్తున్నారు. సరిపడా నిల్వలు ఉన్నప్పటికీ కృత్రిమ కొరత సృష్టిస్తూ దండుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురవడంతో మొక్కజొన్న, పత్తి, వరి తదితర పంటలు సాగు చేశారు. వీటికి ప్రస్తుతం యూరియా అత్యవసరం. దీంతో దుకాణాల ఎదుట క్యూ కడుతున్నారు.

1.30 లక్షల ఎకరాల్లో సాగు

పరిగి నియోజకవర్గంలో పరిగి, పూడూరు, కుల్కచర్ల, దోమ, చౌడాపూర్ ఐదు మండలాలు ఉన్నాయి. సుమారు 1,40,000 వేల ఎకరాల్లో సాగు భూమి ఉంది. దాదాపు 1.30 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వర్షాధారం కింద వేసిన పత్తి, మొక్కజొన్నకు యూరియా వేస్తున్నారు.

రైతులపై రవాణా చార్జీల మోత

వివిధ కంపెనీల నుంచి డీలర్లకు నేరుగా ట్రాన్స్‌పోర్ట్ ద్వారా యూరియాతో పాటు ఇతర ఎరువులు వస్తుంటాయి. సదరు కంపెనీలు వీరికి ఒక్కో బస్తాపై రూ.15 వరకు కమీషన్ ఇస్తుంటాయి. వీటిని కొనుగోలు చేసిన రైతుల వద్ద ఎలాంటి రవాణా చార్జీలు వసూలు చేయకూడదనే నిబంధన సైతం ఉంది. కానీ ట్రాన్స్‌పోర్ట్ పేరుతో వ్యాపారులు బస్తాపై రూ.40 అదనంగా వసూలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా రైతులకు చేయూతనివ్వాల్సిన సహకార సంఘాలు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల నిర్వాహకులు సైతం పలు చోట్ల అధిక ధరలు తీసుకుంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

3వేల టన్నులు సరఫరా

వానాకాలం సీజన్ ప్రారంభమైన రోజు నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ, ప్రైవేటు దుకాణాలకు కలిపి మొత్తం 3,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయ్యింది. దీన్ని పరిశీలిస్తే అసలు యూరియా కొరత అనే మాటే ఉండకూడదు. కానీ వర్షాలు కురుస్తుండటంతో రైతులు యూరియా వేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న వ్యాపారులు కృత్రిమ సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారు.

గట్టిగా అడిగితే లేదంటున్నారు



ఎనిమిది ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. వర్షాలు పడటంతో యూరియా వేసేందుకు వెళ్తే ఒక్కో బస్తాకు రూ.300 తీసుకున్నారు. ఇంత ధర ఏమిటని గట్టిగా అడిగితే యూరియా లేదు వెళ్లిపోండి అంటున్నారు.

– గుడిసె బాబు, బొంపల్లి

చర్యలు తీసుకుంటాం

ఎట్టిపరిస్థితిలోనూ ఎమ్మార్పీకి మించి విక్రయించకూడదు. ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా సంబంధిత షాప్‌ను సీజ్ చేస్తాం. రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదు. విక్రయాలు, స్టాక్ రిజిస్టర్లు నమోదు చేయాలి.

– డీఎస్ లక్ష్మికుమారి, పరిగి ఏడీఏ

సమస్యల పరిష్కారానికే 'బస్తీబాట'

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే బస్తీబాట కార్యక్రమం చేపట్టామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని 2,3 వార్డుల్లో బస్తీబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి పట్టణాభివృద్ధికి పాటుపడుతున్నామని చెప్పారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులకు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, కౌన్సిలర్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులను పర్మినెంట్ చేయాలని వినతి

ఏళ్ల నుంచి పోలీసుశాఖలో పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని నియోజకవర్గ హోంగార్డులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో హోంగార్డులు గోపాల్ రెడ్డి, వెంకటయ్య, భీమయ్య, మల్లేశ్, వెంకటేశ్, పెంటయ్య, సంతోష్, శోభ, సురేఖ, మంజుల తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



ప్రశాంత్(ఫైల్)

కుల్కచర్ల: చికిత్సపొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటన కుల్కచర్లలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రశాంత్(25) గతకొంతకాలంగా వ్యక్తిగత సమస్యల కారణంగా మద్యానికి బానిసయ్యాడు. మానసికంగా ఇబ్బంది పడుతున్న యువకుడు మంగళవారం పొలానికి వెళ్తున్నాని చెప్పి అక్కడ పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు అతడిని మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కుల్కచర్ల ఎస్ఐ శ్రీశైలం తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



సంచిత్ గంగ్వార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

కలెక్టర్ సి.నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంపీడీఓలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తెలంగాణ క్రీడాప్రాంగణాలు, పంచాయతీ భవనాలు, మన ఊరు–మన బడి, ఆయిల్ ఫాం, హరితహారం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఐదు రోజుల్లో క్రీడాప్రాంగణాలు అందుబాటులోకి తీసుకువచ్చి క్రీడా సామగ్రి కిట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి వారం రోజుల్లో స్థల సేకరణ పూర్తిచేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు సమన్వయంతో పనిచేసి ఆయిల్ ఫాం సాగును విస్తృతం చేసేందుకు రైతుల ఎంపిక, డీడీల సేకరణ పనులను వారం రోజుల్లో పూర్తి చేసి లక్ష్యం సాధించాలని చెప్పారు. శిక్షణ ముగించుకుని వెళ్తున్న ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు కలెక్టర్ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్ జిల్లా అధికారులు ట్రైనీ కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు.

సీఎం కేసీఆర్ దళిత పక్షపాతి

మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: దళితుల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహేశ్వరంలోని దళితవాడలో రూ.25 లక్షల నిధులతో అంబేడ్కర్ భవన నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని దళితులంతా ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా దళిత బంధు పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. మహేశ్వరంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ భవన నిర్మాణాలకు స్థలాన్ని కేటాయించడంతో పాటు నిధులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం పట్టణంలో రూ. 35.75లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. మహేశ్వరంలో రూ.20 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునితానాయక్ పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటాం

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి



ఆర్థికసాయం అందజేస్తున్న రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: పేదలకు, పార్టీ కార్యకర్తలకు ఎల్లవేలలా అండగా ఉంటానని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బోట్యానాయక్ తండా శివకుమార్ పౌల్ట్రీఫాం ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్నది. కాగా విషయం తెలుసుకున్న రామ్మోహన్‌రెడ్డి బుధవారం పౌల్ట్రీఫాంను పరిశీలించారు. వెంటనే రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు భరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, పీరంపల్లి శ్రీనివాస్, సాల్విడు శ్రీను తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని ఇప్పాయిపల్లికి చెందిన ఆదర్శ్ ఆకస్మికంగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీఆర్ఆర్ ఆదర్శ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

సోషల్ మీడియా పాత్ర కీలకం

మాజీమంత్రి ప్రసాద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్ కుమార్

అనంతగిరి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపులో సోషల్ మీడియా పాత్ర కీలకమని మాజీమంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక సోషల్ మీడియా మెంబర్ కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్‌ను వివిధ మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి ముఖ్యంగా యువతలోకి తీసుకువెళ్లాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను సెటైరికల్‌గా వీడియో, ఫొటోల ద్వారా సోషల్ మీడియాలో ముమ్మరంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి రఘుపతి రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి చాపల శ్రీనివాస్, కృష్ణారెడ్డి, యాదగిరి, అజీమ్, గౌస్, నర్సింహులు, సిద్దయ్య, విజయ్ కుమార్, నరేందర్, మహేందర్, అమన్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అతివేగంతోనే ప్రమాదాలు

- ప్రయాణికుల భద్రతకు పటిష్ట చర్యలు
- పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి
- ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన



మాట్లాడుతున్న పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: అతివేగం కారణంగానే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం పాఠశాలల వాహన డ్రైవర్లు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతీ వాహనానికి ఫిట్‌నెస్, డ్రైవర్‌కు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించే వాహనాలపై దృష్టి పెడుతున్నామన్నారు. డ్రంక్ అండ్, మితిమీరిన వేగంతో ప్రయాణించే వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అతివేగం తగదు

ఇటీవల ఓవర్ స్పీడ్‌తో వెళ్తున్న ఆటో బోల్తా కొడంగల్ వద్ద బోల్తా పడటంతో విద్యార్థులకు గాయాలైన సంఘటనను డీఎస్పీ గుర్తుచేశారు. చన్గోముల్ నుంచి కర్ణాటక సరిహద్దులోని కొడంగల్ వరకు ఉన్న హైవేపై గత ఏడు నెలలుగా 70మంది మృత్యువాత పడ్డారని తెలిపారు. వాహనాలు నిర్లక్ష్యంగా, అతివేగంగా నడపడంతోనే ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయని వివరించారు. వాహనాలను నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, లేదంటే కుటుంబాలు రోడ్డున పడుతాయని తెలిపారు.

సీజ్ చేస్తాం..

ఎంవీఐ లావణ్య మాట్లాడుతూ.. ప్రతీ వాహనానికి అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని సూచించారు. అన్నీ సరిగ్గా ఉంటేనే బీమా వర్తిస్తుందని తెలిపారు. జిల్లాలో స్కూళ్లకు సంబంధించిన సుమారు 200 వాహనాలు ఉన్నాయని, వీటిలో 140 వెహికిల్స్‌కు మాత్రమే పూర్తిస్థాయి ఫిట్‌నెస్ పత్రాలు కలిగి ఉన్నాయని, మిగిలిన యాజమాన్యాలు వెంటనే ఫిట్‌నెస్ చేయించుకోవాలని సూచించారు. లేదంటే తనిఖీలు నిర్వహించి సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాములు, బొంరాస్‌పేట ఎస్ఐ శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శభాష్.. సావిత్రి

ఐఐటీ బార్వాద్‌లో సీటు సాధించిన గిరిజన బిడ్డ

కుల్కచర్ల: మారుమూల ప్రాంతానికి చెందిన గిరిజన విద్యార్థిని సావిత్రి ఐఐటీ బార్వాద్‌లో సీట్ సాధించింది. చౌడాపూర్ మండలం భజ్యానాయక్ తండాకు చెందిన సావిత్రి గత నెలలో ప్రకటించిన జేఈఈ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించింది. సావిత్రికి మొదటగా వారణాసి యూనివర్సిటీలో అవకాశం రాగా కొన్ని ఇబ్బందుల నేపథ్యంలో రెండో విడత కౌన్సిలింగ్‌కు దరఖాస్తు చేసుకోగా బుధవారం కర్ణాటకలోని ఐఐటీ బార్వాద్‌లో సీటు వచ్చినట్లుగా సంబంధిత యూనివర్సిటీ అధికారులు సమాచారం అందించారు. సావిత్రి విద్యాభ్యాసం పూర్తిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే జరిగింది. 5వ తరగతి వరకు స్థానిక పాఠశాలలో చదవగా.. 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాల (పరిగి)లో చదివింది. స్థానిక సర్పంచ్ శోభ రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సావిత్రిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

కండ్ల కలకపై భయాందోళన వద్దు

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రవీంద్రయాదవ్

కొడంగల్ రూరల్: ఇటీవల వాతావరణ మార్పులతో కండ్ల కలక వ్యాధి సోకుతుందని.. వైద్యుల సూచనలు పాటిస్తూ కండ్ల కలక నివారణకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ సూచించారు. బుధవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. కండ్ల కలక వచ్చినవారు ఆందోళన చెందకుండా వైద్యులను సంప్రదిస్తూ ఐ డ్రాప్స్‌ను ప్రతి రెండు లేదా మూడు గంటలకోసారి వాడుతూ పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కంటి దురద, కళ్లు ఎర్రబడటం వంటి లక్షణాలుంటాయని, కండ్లను పరిశుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. సామాజిక దూరం పాటిస్తూ తాము వాడిన వస్తువులను ఇంకొకరు వాడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. వ్యాధి సోకినవారు ఎలాంటి భయాందోళనకు గురికాకూడదని.. ఇమ్యూనిటీని బట్టి రెండు లేదా, నాలుగు, వారం, 15రోజుల్లో వ్యాధి తగ్గిపోతుందని అన్నారు. కంటి కలత తీవ్రంగా ఉంటే వైద్యులను సంప్రదించాలని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కంటి కలకకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మరుగుదొడ్లను తప్పక వాడాలి

కేంద్ర బృందం సభ్యురాలు దాసరి నాగషైనీ



మోమిన్‌పేట: దేవరంపల్లిలో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

మోమిన్‌పేట: ప్రతీ ఒక్కరు మరుగుదొడ్లను వినియోగించాలని కేంద్ర బృందం సభ్యురాలు దాసరి నాగషైనీ అన్నారు. బుధవారం ఆమె మండల పరిధిలోని దేవరంపల్లి గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్–2023 పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో పర్యటించి మరుగుదొడ్లు నిర్మించుకునే సమయంలో ఎన్ని గుంతలు ఉపయోగించారు..? చాంబరులు, ఇంకుడు గుంతలు, సామాజిక ఇంకుడు గుంతలుచ సేంద్రియ ఎరువుల తయారీ విధాన ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇంట్లో వినియోగించిన నీటిని ఇంకుడు గుంతలకు మళ్లించాలని సూచించారు. అవసరం ఉన్న చోట సామాజిక ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం, పాఠశాలల్లో తప్పక ఇంకుడు గుంతలు నిర్మించాలని చెప్పారు. తడి చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజారెడ్డి, ఎంపీఓ యాదగిరి, ఏపీఎం రాజు, ఏపీఓ శంకర్, కార్యదర్శి బాల్‌రాజ్, ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటరు లక్ష్మి తదితరులున్నారు.

యాప్‌తో ఉన్నతాధికారులకు నివేదిక

కుల్కచర్ల: కేంద్ర పరిశీలన బృందం బుధవారం మండల పరిధిలోని కుల్కచర్ల, బొంరెడ్డిపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు లోకేశ్, మౌనిక గ్రామ పరిధిలోని ఆలయాలు, పాఠశాలలు, ఇళ్ల దగ్గర ఏర్పాటు చేసిన కిచెన్‌షెడ్, మరుగుదొడ్లను పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను, జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం, నిధుల ద్వారా నిర్మించిన మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు తదితర వాటిని పరిశీలించి వాటి నిర్వహణ, ప్రస్తుత పరిస్థితి గురించి ప్రత్యేక యాప్ నుంచి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ రామ్మూర్తి, సరళ, ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ ఖరీం, ఏపీఎం శోభ, ఏపీఓ వెంకటేశ్, సర్పంచ్ సౌమ్యారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో పారదర్శకత తప్పనిసరి

ఉపాధి హామీ జిల్లా అంబుడ్స్‌మెన్ రాములు



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న రాములు, అధికారులు

మర్పల్లి: ఉపాధి హామీ పనులను పారదర్శంకంగా చేపట్టాలని ఉపాధి హామీ పథకం జిల్లా అంబుడ్స్‌మెన్ గుర్రం రాములు క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో 3 సంవత్సరాల నుంచి చేపట్టిన వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, కంపోస్టు షెడ్, కంపోస్టు ఎరువు విక్రయ విధానంపై మంగళవారం ఆయన ఎంపీడీఓ రాజ్ మల్లయ్య, ఏపీఓ అంజిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించుకున్న మరుగుదొడ్లకు రెండు సెప్టిక్ ట్యాంకులు ఉన్నాయా? ఏవిధంగా ఉపయోగించుకొంటున్నారనే విషయాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చేపట్టే పారిశుధ్య పనులపై కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ధరమ్‌సింగ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం పనులు పారదర్శకంగా చేపట్టాలని, కూలీలు వలస వెళ్లకుండా స్థానికంగానే పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మహేష్, ఈసీ విఠల్, టీఏలు బల్వంత్‌రెడ్డి, వార్డుమెంబర్లు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, ఉపాధి సిబ్బంది తదితరులు ఉన్నారు.